www.aashwi.net / in

PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



దేశంలోని అన్ని జిల్లాల్లో AIPC కమిటీల ఏర్పాటు

5

శుక్రవారం, 16-10-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :155 Issue :155 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



ఎల్నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అందరూ సహకరించాలి

- ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం
- వొచ్చే సీజన్లో రైతులు వరి పంట వేయొద్దు
- ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళిక
- నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి
- రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి
- తాగునీటికే క్లిష్టమైన పరిస్థితి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్:

ప్రస్తుత ఎల్నినోను ఎదుర్కొనడానికి అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించి ఒక కార్యాచరణను రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇది గతంలో వొచ్చిన ఎల్నినోలకంటే తీవ్రమైందన్నారు. నీటికొరత ఏర్పడే పరిస్థితి వున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా ఏర్పడుతోంది.వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు.56 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు.అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది. అంటే అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది.రాష్ట్రంలోని

మిగతా 2వ పేజీలో..



సంపద సృష్టికర్తలకు సహకారం




- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు గార్డియన్‌గా ఉంటా
- పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి భరోసా

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు కృషిచేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో జరుగుతున్న సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్ 2026 రెండో రోజు

మిగతా 3వ పేజీలో..

బీమా బాండ్ తో రోడ్డునపడ్డ మూడువేల రైతు కుటుంబాలు



- బీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం
- రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వలేక చేతులెత్తేసిన ప్రభుత్వం
- సీఎం, డిప్యూటీ సీఎంల వైఫల్యం రాష్ట్రానికి శాపం
- సిద్దిపేటలో హరీష్ రావు ధ్వజం

3

22ఏతో భూ యజమానులకు ఇబ్బందులు

- ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ప్రభుత్వం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2



పండగల వేళ నిరసనలతో వ్యాపారులకు నష్టం

- దీపావళి వరకు ఆందోళనలకు అనుమతివ్వొద్దని అమిత్ షాకు వ్యాపార సంఘం లేఖ
- అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిరసన
- అక్టోబర్ 10 ఆందోళనతో రూ.2,000 కోట్ల నష్టం
- ఢిల్లీలో 20 లక్షల మంది వ్యాపారులపై ప్రభావం పడే అవకాశం

6



యాదాద్రి ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు

- నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై రేవంత్ సర్కార్ చర్యలు
- ప్లాంట్ పర్యవేక్షణకు ఐదుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

3

నేడు 41 బార్లకు లక్కీ డ్రా..

- ఉదయం 11 గంటలకు లైసెన్సుల ఎంపిక
- టీసీయూఆర్ పరిధిలోని 14 బార్లకు 4,251 అప్లికేషన్లు
- ఇతర ప్రాంతాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు
- ఉదయం 9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని అధికారుల సూచన

2



నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

- ప్రామాణిక అర్బన్ పోలీసింగ్ అవసరం
- నేరాల కట్టడికి నిరంతర గస్తీ
- స్పందించే తీరును బట్టే పోలీసుల పనితీరుపై అంచనా
- మల్కాజిగిరి కమిషనరేట్ సమీక్షలో డీజీపీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబరు 15, ఆశ్వి అప్డేట్స్:

నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, పటిష్ఠ నిఘా, సత్వర స్పందన కీలకమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. అర్బన్ పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వినూత్న విధానాలను వినియోగిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. నేరాల స్వభావం, ప్రాంతాల వారీ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని గస్తీ, నిఘా పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌లో సీపీ సుమతి, ఇతర పోలీసు అధికారులతో గురువారంనిర్వహించిన సమీక్షలో ఆయన నేరాల నియంత్రణ, దర్యాప్తు, రాత్రి గస్తీ, రోడ్డు

మిగతా 3వ పేజీలో..

బొగ్గు దిగుమతి పేరుతో రూ.3వేల కోట్ల కుంభకోణం

- భోత్రా లాజిస్టిక్స్ తో సీఎం చీకటి ఒప్పందం
- కావాలనే కృత్రిమ బొగ్గు కొరత
- కరెంట్ సంక్షోభం సృష్టించిందే రేవంత్
- మొత్తం స్కాంపై స్వతంత్ర విచారణ జరపాలి
- సింరేణికి రూ.60వేల కోట్ల బకాయిలకు ఎగనామం
- దిగుమతి చేసుకునే బొగ్గుకు టన్నుకు రూ.1500 కమీషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2





బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింగరేణికి నష్టం

- వేలంలో పాల్గొనక కోయగూడెం, సత్తుపల్లి గనులను కోల్పోయింది
- బహుళ అంచెల నిఘా వ్యవస్థతో బొగ్గు మాయమయ్యే ప్రసక్తే లేదు
- రెండేళ్లలోనే నైనీ, తాడిచర్ల-2 గనులకు మైనింగ్ అనుమతులు సాధించాం
- ఆధారాలు ఉంటే బయటపెట్టాలి, లేకపోతే దుష్ప్రచారం మానాలి
- బీఆర్ఎస్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు ఘాటు కౌంటర్

2

బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింగరేణికి నష్టం

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

సింగరేణి సంస్థపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో, పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణికి తీరని నష్టం జరిగిందని, ఆ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 4 మిలియన్ టన్నుల జీ9 గ్రేడ్ బొగ్గు సరఫరా అయిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి 25 మిలియన్ టన్నులకుపైగా బొగ్గు సరఫరా చేయగా, అందులో జీ9 గ్రేడ్ బొగ్గు 1.20 మిలియన్ టన్నులు మాత్రమేనని, అందులోనూ 0.52 మిలియన్ టన్నులు తెలంగాణ జెన్కోకే వెళ్ళింద ని చెప్పారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ఏటా 14 మిలియన్ టన్నుల జీ9 బొగ్గు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, దానికి తగ్గట్టుగా కొత్త గనులను ఎందుకు తెచ్చి ఉత్పత్తిని పెంచలేకపోయిందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వేలంలో సింగరేణిని పాల్గొననివ్వకపోవడం వల్లే కీలకమైన కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాకులు దక్కలేదని, ఫలితంగా ఏటా 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవకాశాన్ని సంస్థ కోల్పోయిందన్నారు. అలాగే 14 గనులు మూతపడటంతో మరో 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోవడం వాస్తవం కాదా అని నిలదీశారు.

రెండేళ్లలోనే నైనీ, తాడిచర్ల-2 అనుమతులు సాధించాం

తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన కేవలం రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తికి మార్గం సుగమం చేశామని శ్రీధర్‌బాబు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నైనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. 2013లో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తాడిచర్ల బ్లాక్ 2కు మైనింగ్ అనుమతులు తెచ్చామని, వేలం ద్వారా మణుగూరు పీకే ఓసీ2 డిప్సైడ్ బ్లాక్‌ను సింగరేణికి దక్కించామని వివరించారు. వీటన్నింటి ద్వారా రానున్న రోజుల్లో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు.

బహుళ అంచెల నిఘా వ్యవస్థ – బొగ్గు మాయం అసాధ్యం

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, లోడింగ్, రవాణా, తూకం నుంచి పంపిణీ వరకు ప్రతీ దశలోనూ సాంకేతిక ఆధారిత బహుళ అంచెల నిఘా వ్యవస్థ అమలులో ఉందని మంత్రి తెలిపారు. ఎస్ఏపీ/ఈఆర్పీ అనుసంధానం, జీపీఎస్/జీపీఆర్ఎస్ ద్వారా వాహనాల ట్రాకింగ్, జియోఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ తూకం, ఆకస్మిక తనిఖీలు, బొగ్గు చోరీ నిరోధక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. ప్రతీ టన్ను బొగ్గుకు పక్కా లెక్క ఉన్న ఈ వ్యవస్థలో బొగ్గు మాయమయ్యే అవకాశమే లేదన్నారు. బీఆర్ఎస్ నాయకుల వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని, లేకపోతే సింగరేణి కార్మికులు, అధికారుల నిజాయతీపై బురద చల్లడం మానాలని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

సంస్థ ప్రయోజనం కోసమే సైట్ విజిట్ నిబంధన

ఓవర్ బర్డెన్ తొలగింపు టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనను పారదర్శకత కోసం, సంస్థ శ్రేయస్సు కోసమే ప్రవేశపెట్టామని మంత్రి సమర్థించుకున్నారు. గతంలో కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయి భౌగోళిక పరిస్థితులు చూడకుండానే టెండర్లు వేసి, తర్వాత పనులు చేయలేక మధ్యలోనే వదిలేసి వెళ్లేవారని, దానివల్ల సింగరేణికే నష్టం జరిగేదని గుర్తుచేశారు. ఈ నిబంధన వల్ల సమర్థులైన కాంట్రాక్టర్లు ఎలాంటి అవాంతరాలు లేకుండా పనులు పూర్తిచేస్తున్నారని తెలిపారు. జీఎండీసీగుజరాత్, జీఐపీసీఎల్, ఎన్ఎండీసీ, కొన్ని సోలార్ ప్రాజెక్టులు, ఈపీసీ కాంట్రాక్టుల్లోనూ, అలాగే 2018, 2021, 2023లో గత ప్రభుత్వ హయాంలోనూ సీఎంపీడీఐ సలహా మేరకు ఈ నిబంధన అమల్లో ఉందని, అప్పుడు సరైనదైన నిబంధన ఇప్పుడు తప్పెలా అవుతుందని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు.

సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నది బీఆర్ఎస్సే

పదేళ్ల పాలనలో బీఆర్ ఎస్ సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నదని, విద్యుత్ సంస్థల పేరుతో రూ.వేల కోట్ల బకాయిలు పెట్టి సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. కాళేశ్వరం నుంచి మిషన్ భగీరథ వరకు రూ.లక్ష కోట్ల కుంభకోణాలకు పాల్పడిన వారు అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

నేడు 41 బార్లకు లక్కీ డ్రా..

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలో కొత్త బార్ల లైసెన్సుల కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 41 బార్లకు వచ్చిన 8,770 దరఖాస్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టి లైసెన్సులు కేటాయించనున్నారు.

టీసీయూఆర్ పరిధిలోని 14 బార్ల కోసం 4,251 దరఖాస్తులు రాగా, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని 27 బార్లకు 4,519 అప్లికేషన్లు వచ్చాయి. పరిమిత సంఖ్యలో ఉన్న బార్లకు భారీగా దరఖాస్తులు రావడంతో లైసెన్సులు ఎవరికి దక్కుతాయనే ఆసక్తి నెలకొంది.

టీసీయూఆర్ బార్లకు డ్రా

టీసీయూఆర్ పరిధిలోని 14 బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. గండిపేట మండలం నార్సింగ్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్‌లో డ్రా నిర్వహించనున్నట్లు సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్ వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు లక్కీ డ్రా ద్వారా లైసెన్సుదారులను ఎంపిక చేయనున్నారు.

ఉదయం 9 గంటలకే చేరుకోవాలి

లక్కీ డ్రాకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపించినట్లు అధికారులు తెలిపారు. వారంతా శుక్రవారం ఉదయం 9 గంటలకల్లా సంబంధిత కేంద్రాలకు చేరుకోవాలని డిప్యూటీ కమిషనర్లు సూచించారు. డ్రా పూర్తయితే 41 బార్లకు కొత్త లైసెన్సులు ఎవరికి దక్కనున్నాయో స్పష్టత రానుంది.

22-ఏతో భూ యజమానులకు ఇబ్బందులు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చాలా చోట్ల 2030 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. తమ భూమి తమకు ఉంటుందో లేదోనన్న ఆందోళనతో బాధితులు కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ పేరుతో అవినీతి జరుగుతోందని, నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించుకోవాలంటే లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఇదే నేపథ్యంలో రాష్ట్రంలో ఇటీవల అనేకమంది రెవెన్యూ అధికారులను ఏసీబీ పట్టుకుంటున్న ఘటనలు కూడా చూస్తున్నామన్నారు. శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేటలో సుమారు 1,500 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ఆ రైతులు తమ సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోనూ ఒక సర్వే నంబరులో ఏదో ఒక ప్లాట్ ప్రభుత్వ భూమి ఉందనే కారణంతో ఆ సర్వే నంబర్‌లోని మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేరుస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతుండగా, బడా బాబులు, బిల్డర్లు లాభపడుతున్నారన్నారు. ప్రజల భూముల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం నిషేధిత జాబితా పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. 22ఏ జాబితాలో భూముల చేర్పు, తొలగింపుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ అంశానికి సంబంధించిన పలు కీలక వివరాలను బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. 22ఏ సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అందరూ సహకరించాలి

మొదటిపేజీ తరువాయి


30 లక్షల పంప్‌సెట్లు ఆన్ అయ్యాయి. మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబర్‌లో ఉంది. డిప్యూటీ సీఎం భట్టి, విద్యుత్ శాఖ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా విద్యుత్ శాఖ మంత్రి, అధికారులు చిత్తశుద్ధిని చూపించారు. ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఈ రెండేళ్లలో ఆరు, ఏడు వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులకు, ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి. చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష్యంతో మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నామన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా విద్యుత్ కొరతతో ఉన్నాయి. రైతులు మనోధైర్యం కోల్పోకుండా మా ప్రభుత్వం విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. గృహ అవసరాలకు తగినట్లుగా విద్యుత్‌ను అందిస్తున్నాం. కృష్ణా బేసిన్‌లో 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. 23 శాతం లోటు వర్షపాతం ఉంది. అన్ని రిజర్వాయర్లు వట్టిపోయే దశలో ఉన్నాయి. 24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది. తాగునీటికే ఈ రోజు క్లిష్టమైన పరిస్థితి ఉందని గుర్తు చేశారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

చలికాలం ఎండాకాలంలా ఉంది. వచ్చే 8 నుంచి 10 నెలల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే దానిపై ఈ రోజు సమావేశంలో చర్చించాం. 10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పంటను ఎండిపోనివ్వొద్దని అధికారులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడాలి. సాగుకు నీటిని పొదుపుగా వినియోగించాలి. 460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో ఇప్పుడు కేవలం 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నీటిని పంటలకు ఇస్తే కేవలం నారుమళ్లకే సరిపోతాయి. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలి. ఈ నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు పెద్ద మనసు చేసుకుని యాసంగిలో పంటలు వేయడం తగ్గించుకోవాలని కోరారు. చుక్క చుక్కను ఆదా చేసుకోవాలి. వచ్చే సీజన్‌లో వరి వేయడాన్ని వాయిదా వేసుకోవాలి. ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం. గత ఏడాది ఈ సమయంలో 25 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తే, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలను ప్రాధాన్యతగా తీసుకుని మరమ్మతులు చేయాలి. వానాకాలంలో నష్టపోయిన పంటతో పాటు వచ్చే సీజన్‌లో పంట వేయకుండా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలన్నారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు తయారు చేయాలి.

ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోంది. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను తీసుకుని, మిగిలిన రాష్ట్రాలకు తక్కువ ధరకు కేంద్రం అందించాలి. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ ఏం చేయమన్నా చేశాం. ఆ రోజు విధానాలు, జెండాలు మేం చూడలేదు. ఒకే విధానంలో ముందుకు వెళ్లాలన్న ప్రధాని అప్పీల్‌కు అనుగుణంగా ముందుకు వచ్చాం. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తితో వ్యవహరించాలి. అన్ని పార్టీలు, ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సహకరించాలి. ప్రభుత్వ సూచనలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలి. అందరి సహకారం ప్రభుత్వానికి కావాలి. మీడియా సహకారం ప్రభుత్వానికి వందకు వంద శాతం అవసరం. ప్రభుత్వం నుంచి మీడియా కోసం ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తాం. టోల్ ఫ్రీ నంబర్ ఇస్తాం. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు.. అందరితో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాం. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అత్యంత ముఖ్యం. లేకుంటే పిట్టల్లా రాలిపోయే ప్రమాదం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశాం. పేదలకు



ఏ కష్టం వచ్చినా తక్షణమే ఆదుకోవాలన్న కార్యాచరణను రూపొందించాం. ఎల్‌నినోను ఎదుర్కోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ఈ సమస్యను ఎదుర్కోవడంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ప్రభుత్వం నిత్యం దీనిపై అప్రమత్తంగా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని వివరిస్తాం. ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రిని, ఇతర మంత్రులను కలుస్తాం. ప్రజలను చైతన్యపరచడానికి కళాజాతాలను ఏర్పాటు చేస్తాం. సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు పత్రికల్లో వ్యాసాలు రాయాలి. సినీ నటుడు విజయ్ దేవరకొండ ఎల్‌నినోపై ఒక విజ్ఞప్తి చేశారు. మిగిలిన సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారం తీసుకుని వారితో ప్రజలకు ఒక విజ్ఞప్తి చేయించి అప్రమత్తం చేస్తాం. అందరి సమస్య.. అందరం కలిసి విజయవంతంగా ఎదుర్కోవాలన్నారు.

నీటి, పశుగ్రాసం కొరత ఉండొద్దు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటినుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం కొరత వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. వీబీ జీ రామ్ జీ ద్వారా కరువు నివారణ చర్యలపై బేగంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఇతర గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో ప్రస్తుతం కూడా ఐటీడీఏలు, పంచాయతీరాజ్ శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

వర్షపాతం లోటు నేపథ్యంలో ముందస్తు చర్యలు

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాలు సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికిపైగా లోటుతో ఉన్నాయని సదస్సు నివేదిక పేర్కొంది. 18 జిల్లాల పరిధిలోని 320 మండలాలల్లో తీవ్ర ఎల్నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిందని వివరించింది. ఈ సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వర్షపాతం లోటు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేసవి ప్రభావం ఈసారి దాదాపు ఎనిమిది నెలలపాటు ఎదుర్కోవాల్సి రావచ్చని అన్నారు.

ఆదివాసీ గిరిజన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా ఒకే పంటకు పరిమితమవుతుందని, రెండో పంట సాగు చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు. దీంతో ఆదివాసి గిరిజన కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలకమన్నారు. ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్ కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం లభించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆదివాసి గిరిజన నివాస ప్రాంతంలో కనీసం ఒక మేట్‌ను నియమించాలని, వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి పనుల అమలులో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఉపాధి పనులతో గ్రామాలకు శాశ్వత ఆస్తులు

ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పని కల్పించడమే కాక గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించాలని మంత్రి సీతక్క సూచించారు. ఉపాధి హామీ కింద అందుబాటులో ఉన్న 370 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. మట్టి, మొరం రహదారులు, గ్రామాలకు వెళ్లే బాటలు, అన్ని కాలాల్లో వినియోగించుకునే రహదారులు, ఊట చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, చెరువుల్లో పూడికతీత, కాలువలు, ఫీడర్ ఛానళ్లు, కందకాల తవ్వకం వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

పశువులకు నీరు, గ్రాసం అందేలా చర్యలు

ఏజెన్సీ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉంటుందన్న మంత్రి పశువులకు అవసరమైన నీరు, గ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం, నీటి సంరక్షణ పనులు చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే గ్రామాల అభివృద్ధితో పాటు కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయని, వాటికి తగిన పరిష్కారాలు కనుగొనగలమని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

సమన్వయంతో ఎల్‌నినోను ఎదుర్కోవాలి

పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏలు, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవాలని మంత్రి పిలుపునిచ్చారు. సర్పంచులు, క్షేత్రస్థాయి సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులను భాగస్వాములను చేస్తూ ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి కల్పనతోపాటు నీటి సంరక్షణ, పశుగ్రాసం అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు డీఆర్డీవోలు, పీవోలు, ఎంపీడీవోలు సదస్సులో పాల్గొన్నారు.

బొగ్గు దిగుమతి పేరుతో రూ.3వేల కోట్ల కుంభకోణం

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్రంలో బొగ్గు, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి ఇప్పుడు అదే సంక్షోభాన్ని కుంటిసాకుగా చూపి విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సుమారు రూ.3,000 కోట్ల భారీ బొగ్గు కుంభకోణానికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో తీవ్రంగా తప్పుబట్టారు. ఇటు సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా, అటు దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నా దేశీయ సరఫరాను పెంచే దిశగా చర్యలు తీసుకోకుండా విదేశీ బొగ్గు వైపే మొగ్గు చూపడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు కరెంట్ కోతలపై ప్రజలు, రైతుల ఆందోళనను బూచిగా చూపి దిగుమతులకు అనుకూలంగా మలుచుకోవడం వెనక భారీ స్కాం దాగి ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ అనే కంపెనీ పాత్ర అత్యంత అనుమానాస్పదంగా కనిపిస్తోందని, ఈ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటి? ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చేశారు? టెండర్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగింది? ఈ ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. లాజిస్టిక్స్‌తో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులన్నింటినీ బహిర్గతం చేయాలి.. ఈ కంపెనీ ఎంపికకు కారణాలు, దానికి ఇప్పటి వరకు అప్పగించిన కాంట్రాక్టులు, చెల్లించిన నిధులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంలో ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారో ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. టన్నుకు రూ.1,500 కమీషన్ చొప్పున ఏకంగా రూ.3,000 కోట్ల దోపిడీకి మీరు చీకటి ఒప్పందాలు చేసుకున్నట్టు అర్థమవుతోందన్నారు.

విద్యుత్ డిమాండ్ వేసవిలో పెరుగుతుందని, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా అవసరమని ప్రభుత్వానికి ముందే తెలుసు. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో కీలకమైన అంశమని. 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదు కాగా, 2025-26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. ఇది మీ ప్రభుత్వ వైఫల్యం కాదా, మీ నిర్లక్ష్యానికి ప్రజాధనం వృధా చేసి భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితిని ఎందుకు సృష్టించారు అని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. గనుల అభివృద్ధికి, ఉత్పత్తి పెంపునకు అవసరమైన నిధులు అందించకుండా సింగరేణి సామర్థ్యాన్ని దెబ్బతీసి, ఆ తర్వాత దేశీయ బొగ్గు సరిపోవడం లేదని చెప్పడం మీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు. ఒడిశాలోని నైని బ్లాక్‌లో సింగరేణి బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో అక్కడి నుంచి సరఫరాను పెంచేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? మహానది ప్రాంతం నుంచి బొగ్గు సరఫరా చేసుకునే అవకాశాలున్నా ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరా విషయంలోనూ మీ వాదనకు అర్థంలేదన్నది స్పష్టమైందన్నారు. 2018 ఫిబ్రవరి 15న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఎఫ్.నెం.23014/1/2018సీఎల్డీ ప్రకారం సింగరేణి గనుల నుంచి యాదాద్రికి సంవత్సరానికి 14 మిలియన్ టన్నుల జీ9 గ్రేడ్ బొగ్గు సరఫరాకు లింకేజీ కేటాయింపు జరిగింది. 2022 ఏప్రిల్ 27న సరఫరాకు సంబంధించి ఒప్పందం కూడా కుదిరింది. మరి ఇప్పుడు బొగ్గు కొరత, నాణ్యత సమస్యల పేరుతో విదేశీ బొగ్గు దిగుమతుల అవసరాన్ని ఎందుకు ముందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు, యాష్ హ్యాండ్లింగ్ వంటి పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన దుర్మార్గంపై మీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జెన్‌కోకు థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణలో అనుభవజ్ఞులైన ఇంజినీర్లు,



సాంకేతిక నిపుణులు ఉన్నారు. సుమారు 7,500 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యం కలిగిన ప్లాంట్ల నిర్వహణ అనుభవం ఉన్నప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యాన్ని వినియోగించకుండా ప్రైవేటు సంస్థలకు పనులు అప్పగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కరెంట్ కోతలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెరిగినప్పుడు ప్రభుత్వం అధికారులపై నెపం నెట్టి తప్పించుకోవాలని చూడటం హేయమైన చర్య అన్నారు. నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతుల ప్రతిపాదనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రూ.3,000 కోట్ల బొగ్గు కుంభకోణంపై స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గుదలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి.. సింగరేణికి రావాల్సిన బకాయిలపై సంస్థల వారీగా పూర్తి లెక్కలు ప్రకటించాలి.. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరాపై స్పష్టత ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు.

సంపద సృష్టికర్తలకు సహకారం

మొదటిపేజీ తరువాయి

గురువారంనాటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్, ప్యూర్, రేర్ అనే మ□డు విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వాటి గురించి సవివరంగా భట్టి విక్రమార్క తెలిపారు.

సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర

మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించే వారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

పరిశ్రమలకు ప్రభుత్వ అండ

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.

అందరినీ కలుపుకుని అభివృద్ధి సాధించాలి

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

మొదటిపేజీ తరువాయి



ప్రమాదాలు, సైబర్ నేరాలపై సమీక్షించారు. బొల్లారం కైకూరులోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఐదు సంవత్సరాల పాప దారుణ హత్య ఘటన గుర్తు చేస్తూ నిందితుని అరెస్టు చేసినట్లు వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిరంతరం నిఘాతోపాటు సీసీ టీవీలు కమ్యూనిటీలో ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. దీంతో పాటు బొల్లారంలోని ఆయుధాల చోరీ కేసుకు సంబంధించిన అంశాలను కూడా ఆయన ప్రస్తావిస్తూ ఆయుధాల చోరీ కేసులో పటిష్టమైన దర్యాప్తుతో వెంటనే అరెస్ట్ చేసామన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇళ్లల్లో దొంగతనాలు చేస్తూ దొంగతనాన్ని పాల్పడ్డ నేపాల్ గ్యాంగ్ సంబంధించిన వాటిపైన దృష్టి సాదించాలని, చోరీ కేసులు పటిష్ట నిఘాతోని నియంత్రించాలని ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, ప్రమాదాల హాట్‌స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కీసర, ఎల్‌బీనగర్, ఉప్పల్, బేగంపేట, జవహర్‌నగర్, మేడిపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో ఆస్తి నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరాల గుర్తింపు, సొత్తు రికవరీని మెరుగుపరచడంతోపాటు తీవ్రమైన నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. మురికివాడలు, బస్తీల్లో నేరాల హాట్‌స్పాట్లను గుర్తించి, పునరావృత నేరాలకు పాల్పడేవారిపై బైండోవర్ చర్యలు చేపట్టాలన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు పోక్సో చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. షీ టీమ్స్ సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జవహర్‌నగర్, హయత్‌నగర్, కుషాయిగూడ, వనస్థలిపురం, కీసర పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేసులను క్షుణ్ణంగా సమీక్షించి, సాంకేతిక ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. బాధితులకు పరిహారం అందేలా చూడటంతోపాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు.

గస్తీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


పోలీసు స్టేషన్ల వారీగా నేరాల నమోదును విశ్లేషిస్తూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓలు) డయల్ 112 ఫిర్యాదులపై స్పందించడంతోపాటు గస్తీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తే నేరగాళ్ల కదలికలను నియంత్రించవచ్చన్నారు. పాత నేరగాళ్ల ఇళ్లకు వెళ్లి వారి ప్రస్తుత కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రౌడీషీటర్లను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందుకుగాను 1992 సంవత్సరంలోనే రౌడీలను, ఆర్గనైసేడ్ క్రైమ్స్ ను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసినట్లుగా పేర్కొన్నారు.నేరం జరిగిన వెంటనే సంబంధిత బృందాలు రంగంలోకి దిగి ఆధారాలను సేకరించి, నిందితులను గుర్తించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. డివిజన్ ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, సెక్టార్ పోలీసులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.

కమిషనరేట్ పరిధిలో అక్టోబరు 13 నాటికి 2,474 కేసులు

కమిషనరేట్ పరిధిలో 2026 అక్టోబరు 13 నాటికి 2,474 కేసులు నమోదైనట్లు సీపీ సుమతి వివరించారు. 2024లో 18,778 కేసులు నమోదు కాగా, 2025లో 18,480 కేసులు నమోదయ్యాయి. 2026లో ఇప్పటివరకు ఈ సంఖ్య 23,747కు చేరింది. ముఖ్యంగా దొంగతనాలు, మోసాలు, రోడ్డు ప్రమాదాలు, గాయపరిచే ఘటనలు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.2026లో ఇప్పటివరకు 2,196 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. 2024లో 1,484, 2025లో 1,662 కేసులు నమోదయ్యాయి. మోసాల కేసులు 2024లో 2,404 ఉండగా, 2025లో 2,636, 2026లో 2,789కు పెరిగాయి. గాయపరిచిన ఘటనలు 2024లో 1,311 నుంచి 2026లో 1,797కు చేరాయి. రోడ్డు ప్రమాద మరణాలు 2024లో 308, 2025లో 270 ఉండగా, 2026లో ఇప్పటివరకు 340 నమోదయ్యాయి. హత్యలు 2024లో 40, 2025లో 45, 2026లో 41గా ఉన్నాయి. కిడ్నాప్ కేసులు 2026లో 365కు చేరాయి. ఈ నేపథ్యంలో నేరాల నియంత్రణ, దర్యాప్తు, సొత్తు రికవరీపై పోలీసులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల గణాంకాలను విశ్లేషించి, పెరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీజీపీ అధికారులకు సూచించారు. కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణతో కొన్ని పోలీసు స్టేషన్ల పరిధులు మారాయని, సిబ్బంది కేటాయింపుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. నిందితులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు గుర్తిస్తే, సంబంధిత బృందాలు వెంటనే వెళ్లి వారిని పట్టుకునేలా అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. ఎస్‌ఓటీ బృందాలు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల మరణాలపై డీజీపీ ఆరా తీశారు. కీసర, చర్లపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో గత ఏడాదితో పోలిస్తే ప్రమాద మరణాల సంఖ్య పెరిగినట్లు అధికారులు వివరించారు. ద్విచక్రవాహన ప్రమాదాలు సుమారుగా 25% అధికంగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయని పేర్కొంటూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని డిజిపి సూచించారు. విజయవాడ-వరంగల్ మార్గం, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో పెట్రోలింగ్ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 10 నుంచి 11 సైబర్, వైట్ కాలర్ నేరాల కేసులు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. సైబర్ నేరాల దర్యాప్తులో నైపుణ్యం పెంచేందుకు అవసరమైన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని డిజిపి సూచించారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా సరూర్‌నగర్‌లో ఈగల్ పోలీసు స్టేషన్ ఉపయోగించుకోవాలని డిజిపి సూచించారు. కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అధికారులను గుర్తించి ప్రోత్సాహకాలు, రివార్డులు అందించాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు రౌడీషీటర్లు, సంఘవిద్రోహ శక్తులపై నిఘా కొనసాగించాలని, వివిధ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ అనంతరం మల్కాజిగిరికి 235 పోస్టులు రావాల్సి ఉన్నట్లు సీపీ సుమతి వివరించారు.సమావేశంలో డీసీపీలు , ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీమా బంద్ తో రోడ్డునపడ్డ మూడువేల రైతు కుటుంబాలు

సిద్దిపేట, ఆశ్వి అప్డేట్స్ :



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసీఆర్ అమలు చేసిన రైతు సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేస్తున్నడని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. దేశం మెచ్చిన రైతు బీమా పథకాన్ని నిలిపివేసి రైతు కుటుంబాల ఉసురు పోసుకుంటున్నరని ఆగ్రహం వ్యక్తం చేసారు. సిద్దిపేటలో రైతు బీమా అందని 22 మంది రైతు కుటుంబాలతో క్యాంపు ఆఫీసు వేదికగా హరీశ్ రావు సమావేశమయ్యారు. వారితో కలిసి భోజనం చేసిన హరీశ్ రావు ఆయా కుటుంబాల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. రైతు బీమా పథకం కింద రూ.5లక్షల సాయం అందకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యల గురించి హరీశ్ రావుకు వారు వివరించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రైతు కుటుంబాల ఆవేదన చూస్తే మనస్సు చలించి పోతున్నదన్నారు. ఆగస్టు 15 నుంచి ఈరోజు వరకు ఒక్క సిద్దిపేటలోనే 22మంది రైతులు చనిపోయారు.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3వేల మంది రైతులు చనిపోయారు. రైతు బీమా నిలిపివేయడం వల్ల ఇప్పుడు ఆ మూడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.రేవంత్ రెడ్డి కేసీఆర్ అమలు చేసిన పథకాలు కొనసాగిస్తున్నాం అని మాటలు చెప్పారు కానీ నిజానికి అన్నీ బంద్ చేస్తున్నారు. రైతు బీమా పథకం అమలు చేసి ఉంటే ఇంతమంది రైతు కుటుంబాలు ఎందుకు కన్నీళ్లు పెడుతున్నాయి.. వీరందరికి ఎందుకు రూ.5లక్షలు రాలేదు. ఆగస్టు 14 నుంచి ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రాష్ట్రంలో రైతు బీమా ఆగిపోయింది. ఇక్కడ కన్నీరు మున్నీరు అవుతున్న బాధితులకు మీరేం సమాధానం చెబుతారు? వీరిని ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో చెప్పాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి, తుమ్మల వీరి బాధను ఎలా తీరుస్తారు? తుమ్మల నాగేశ్వరరావు ప్రాథమికంగా రైతు, మీరైనా ప్రీమియం చెల్లించాలని చెప్పాలి కదా. కొత్త పథకం తెస్తాం అని బడ్జెట్ లోచెప్పారు. ఆ పథకం ఇప్పటికీ అతీగతీ లేదు. గుంట భూమి వున్నా కేసీఆర్ పథకం వర్తింప చేసారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి పథకం వర్తింపచేసారు. మీరు చెప్పే పథకం ఇంటి యజమానికి మాత్రమే. ఐక్య రాజ్య సమితి సైతం మెచ్చుకున్న రైతు బీమా పథకాన్ని నిలిపివేసేందుకు మనసెలా వచ్చిందంటూ రేవంత్రెడ్డిని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు మన పథకాన్ని చూసి అమలు చేస్తున్నా మీరు మాత్రం బంద్ చేసారు, ఏ కారణంతో చనిపోయినా రైతు కుటుంబం రోడ్డున పడొద్దని కేసీఆర్ రైతు బీమా అనే పథకానికి 2018లో రూపకల్పన చేసిండు. రైతుల తరపున ప్రభుత్వమే ఏటా రూ.1400 కోట్ల ప్రీమియం ఎల్ఐసీకి చెల్లించి రూ.5 లక్షల భరోసా కల్పించిండు. 2018-19 నుంచి 2023-24 వరకు వివిధ కారణాలతో మరణించిన 1,38,688 మంది రైతు కుటుంబాలకు రూ.7వేల కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించింది. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పే రేవంత్ రెడ్డి.. ప్రీమియం రూ.1400 కోట్లు చెల్లించే తెలివి లేదా? వెంటనే రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా రైతు కుటుంబాలకు చెల్లించాలని, యదావిదిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తే మీరు 8 గంటలు కూడా ఇవ్వడం చేతకావడం లేదు. ఐఎస్, అధికారులను సస్పెండ్ చేస్తాం అని ఎవరి చెవిలో పువ్వులు పెడుతున్నారు. సస్పెండ్ చేయాల్సింది మిమ్మల్ని. 9 నెలల నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ ఉంటుందని చెబుతుంటే ఏం చేసారు?కరెంట్ సరఫరా చేయకపోవడం మీ చేతగాని తనం కాదా? విద్యుత్ అధికారులను బాధ్యులుగా చేసి ఎందుకు వారిపై చర్యలు తీసుకుంటు న్నారు. నీళ్లు ఉన్నా లిఫ్ట్ చేయలేదు, పంట పొలాలకు నీళ్లు ఇవ్వలేదు. బొగ్గు నిల్వలు పెట్టుకోక కరెంట్ కోతలకు కారణం అయ్యారు. అధికారుల తప్పు కాదు ఇది, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఫెయిల్ అయ్యారు. మీ చేతగాని తనంతో విద్యుత్ అధికారులపై వేటు వేస్తారా?ప్రభుత్వం దిగిరాకపోతే రైతు కుటుంబాలతో కలిసి సీఎం ఇల్లు, సచివాలయం ముట్టడిస్తాం అని హెచ్చరిస్తున్నామన్నారు. రైతు కుటుంబాలు ఆందోళన చెందవద్దు.. బిఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది.. అసెంబ్లీ వేదికగా రైతు బీమాపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. మీకు బీమా డబ్బులు వచ్చేలా చేస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

యాదాద్రి ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను సస్పెండ్ చేసింది. మరోవైపు నిర్మాణ పనులను వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ఐదుగురు ఐఏఎస్ అధికారులను క్యాంప్ ఆఫీసర్లుగా నియమించింది. పనుల పురోగతి, నాణ్యత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్లాంట్ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ

నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని ప్రభుత్వం సమీక్షించింది. నిర్మాణంలో జాప్యం, పనుల నిర్వహణలో లోపాలపై దృష్టి సారిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. అక్టోబర్ 14న సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. వీరు ప్లాంట్ ప్రాంగణంలోనే ఉంటూ సివిల్ పనులు, బొగ్గు సరఫరా మార్గాలు, విద్యుత్ తరలింపు కోసం గ్రిడ్ అనుసంధానం, కాంట్రాక్టు సంస్థల పని తీరును నిరంతరం సమీక్షించనున్నారు.

విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం అప్రమత్తం

రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ పెరగడం, సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ప్లాంట్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో ఉత్పత్తిని ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులకు బాధ్యతలు అప్పగించింది. వేసవిలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, టీజీఈఆర్‌సీ మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్థలు సిద్ధంగా ఉండాలని సూచించారు. డిస్కంలకు నిధుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటూనే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించారు. యాదాద్రి ప్లాంట్ పనుల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించడం, నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఈ చర్యలు ప్లాంట్ నిర్మాణాన్ని ఎంతవరకు వేగవంతం చేస్తాయి, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎంతమేరకు దోహదపడతాయన్నది కీలకంగా మారింది.

దసరానాడు వరంగల్ సూపర్ స్పెషాలిటీ సాఫ్ట్ లాంచ్

వరంగల్, ఆశ్వి అప్డేట్స్:

ఉత్తర తెలంగాణలో అతిపెద్ద హాస్పిటల్‌గా రూపుదిద్దుకుంటున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీలో దసరా పండుగ(20వ తేదీ)రోజున 'సాఫ్ట్ లాంచ్'(ట్రయల్ రన్) జరుగుతుందని, అదే రోజు నుంచి రోగులకు ఓపీ సేవలు అందుబాటులోకి వస్తాయని రెవెన్యూ, సమాచారశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, 'కుడా' చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వైద్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, డీఎంఈ డాక్టర్ వాణిలతో కలిసి హాస్పిటల్‌ను సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీని త్వరతగతిన ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రస్థాయి అధికారులు క్రమం తప్పకుండా సందర్శిస్తూ పనుల్లో వేగం పెంచారు. దసరా నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ సాధ్యమయ్యే పరిస్థితులు లేకపోవడంతో కనీసం ఓపి సేవలైనా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఓపీ సేవలు అందించేందుకు ఎంజీఎం, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని కొన్ని పరికరాలు తీసుకొచ్చి ఈ హాస్పిటల్‌లో ఏర్పాటు చేశారు. ఒకేసారి ఓపీ సేవలతోపాటు వైద్య సేవలు అందించాలంటే వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు మౌలిక వసతులు సమకూర్చాల్సి ఉంటుంది. అందువల్ల ముందుగా ఓపీ సేవలు ప్రారంభించి క్రమేపీ రోగులు పెరిగినకొద్దీ వసతులు కల్పిస్తూ వైద్యులను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబర్ రెండో వారం(9వ తేదీన) సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

పేదవాడి వైద్యానికి పెద్ద పీట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పేదవాడి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి పొంగులేటి తెలిపారు. హాస్పిటల్‌లో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దసరా రోజున హాస్పిటల్ సాఫ్ట్ లాంచ్ జరుగుతుందని, అప్పటినుంచి ప్రజలకు ఓపి సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పనులను వేగవంతం చేసి తుది దశకు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో హైదరబాద్ తర్వాత అతి పెద్ద నగరమైన వరంగల్‌లో ఏర్పాటవుతున్న ఈ హాస్పిటల్ వల్ల ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా పరిధిలోని ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తామన్నారు. ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటకీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కొత్త దవాఖానాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఎంజీఎంలో ఇప్పుడు సుమారు మ□డు వేల ఓపిలు ఉండగా నూతన హాస్పిటల్‌లో 45వేలకు పెరిగే అవకాశం ఉందన్నారు. నిమ్స్‌లో ఎలాంటి సేవలు అందుతున్నాయో నూతన హాస్పిటల్‌లో అలాంటి సేవలు అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే ప్రైవేటు హాస్పిటల్స్ షట్‌డౌన్ కాక తప్పదన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారద, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డీఎంహెచ్‌వో రాజారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యం కావాలి

వరంగల్/హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :

సింగరేణిలో 18 గనులను మూసివేసి 40 వేల మంది కార్మికుల జీవితాలను రోడ్డున పడేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వరంగల్‌లో గురువారం నిర్వహించిన వరంగల్‌నల్గొండఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింగరేణి విషయంలో ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని, పదేళ్ల అధికారంలో గనుల వేలంపాటలో పాల్గొనకుండా సింగరేణికి అన్యాయం చేసిన మీకు ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు గనుల వేలంపాటలో పాల్గొని సింగరేణిని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుందని మంత్రి స్పష్టం చేశారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐతో కలిపి 32 స్థానాల్లో కాంగ్రెస్ పక్షం బలంగా ఉందని మంత్రి తెలిపారు. మిగిలిన రెండు నియోజకవర్గాల్లోనూ గతంలో కాంగ్రెస్‌కు గట్టి పట్టు ఉందని, దీన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కాంగ్రెస్ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేసి పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు సర్వోత్తం రెడ్డికి వేయించేలా కృషి చేయాలని సూచించారు. వచ్చే నెల 6 వరకు ఓటు నమోదు, రెన్యువల్‌కు అవకాశం ఉన్న నేపథ్యంలో దసరా సహా పండుగలకు స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను గుర్తించి అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒక్క వరంగల్ జిల్లాలోనే సుమారు 47 వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, అర్హులైన ఓటర్లందరి ఓటు నమోదు, రెన్యువల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడం పార్టీ ఎన్నికల సన్నద్ధతకు నిదర్శనమన్నారు.

రూ.8 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ
తహశీల్దార్, భూ భారతి ఆపరేటర్

- బహుమతి దస్తావేజు రిజిస్ట్రేషన్‌కు లంచం డిమాండ్

ఆశ్వి అప్డేట్స్ | రాజన్న సిరిసిల్ల | అక్టోబర్ 15



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.8,000 లంచం తీసుకున్నారనే ఆరోపణలపై తహశీల్దార్ కమ్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ అబూబకర్‌తో పాటు, అదే కార్యాలయంలో భూ భారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న శంకసాల అనిల్ కుమార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ఏసీబీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. ఫిర్యాదుదారుడి అత్తకు చెందిన వ్యవసాయ భూమిని ఆయన తండ్రి పేరుపై బహుమతి దస్తావేజు ద్వారా రిజిస్ట్రేషన్ చేయడంలో సహకరించేందుకు తహశీల్దార్ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. భూ భారతి ఆపరేటర్ అనిల్ కుమార్ ద్వారా రూ.8,000 స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

ఆపరేటర్ వద్ద ఉన్న రూ.8,000 లంచం సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తహశీల్దార్‌ను ఏ1గా, ఆపరేటర్‌ను ఏ2గా పేర్కొన్నారు.

ఇద్దరినీ కరీంనగర్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టినట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివరాలను గోప్యంగా ఉంచినట్లు పేర్కొంది.

లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని తెలంగాణ ఏసీబీ సూచించింది. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది

తాగునీటి పైపులైన్లకు అక్రమ మోటార్లు.. 12 స్వాధీనం

- కూకట్‌పల్లి జోన్‌లో జలమండలి విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్ | అక్టోబర్ 15



తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్న వారిపై జలమండలి విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోని డివిజన్22, గాయత్రీనగర్ వార్డులో ఉన్న వివేకానందనగర్ కాలనీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 12 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.

ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జలమండలి విజిలెన్స్ బృందం సంబంధిత మేనేజర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా పైపులైన్లకు నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన మోటార్లను గుర్తించి తొలగించారు.

ఇతర వినియోగదారులకు నీటి సరఫరాకు ఆటంకం

తాగునీటి పైపులైన్లకు నేరుగా మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం వల్ల ఇతర వినియోగదారులకు తగినంత నీరు అందకపోవడంతో పాటు, సరఫరా ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని జలమండలి అధికారులు పేర్కొన్నారు.

ప్రజలందరికీ సమానంగా తాగునీరు అందించేందుకు అక్రమ మోటార్ల వినియోగాన్ని అరికట్టడం అవసరమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మోటార్లు వినియోగించే వారిపై తనిఖీలు కొనసాగిస్తామని, ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివాహితపై అత్యాచారం, దోపిడీ కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

- రూ.20 వేల జరిమానా విధించిన నల్లగొండ మహిళా కోర్టు
- మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ శరత్ చంద్ర పవార్

ఆశ్వి అప్డేట్స్ | నల్లగొండ | అక్టోబర్ 15

వివాహితను అపహరించి అత్యాచారానికి పాల్పడటంతో పాటు, ఆమె ఆభరణాలను దోపిడీ చేసిన కేసులో నిందితుడికి నల్లగొండ మహిళా కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు.

వాహనంలో తీసుకెళ్లి నేరానికి పాల్పడిన నిందితుడు

వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బానోత్ శ్రీను అలియాస్ చిన్నా (35) టాటా ఏస్ వాహనంలో భార్యాభర్తలను ఎక్కించుకొని వెళ్తుండగా, వారు దిగాల్సిన ప్రదేశంలో భర్త వాహనం దిగిన వెంటనే నిందితుడు వివాహితను బలవంతంగా తనతో తీసుకెళ్లాడు. అనంతరం ఆమెను బెదిరించి అత్యాచారానికి పాల్పడటంతో పాటు, ఆమె ఆభరణాలను దోపిడీ చేసి మార్గమధ్యలో వదిలేసి పరారయ్యాడు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు వాడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి ఎస్ఐ కె. నరసింహారావు, మిర్యాలగూడ రూరల్ సర్కిల్ అప్పటి సీఐ ఏ. రమేష్ బాబు దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో నేరం నిరూపణకు అవసరమైన ఆధారాలను సమర్పించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. అఖిల ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

మూడు సెక్షన్ల కింద శిక్షలు

కేసు విచారణ అనంతరం నల్లగొండ మహిళా కోర్టు నిందితుడికి ఐపీసీ సెక్షన్ 366 కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా; సెక్షన్ 376 కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా; సెక్షన్ 392 కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. మొత్తం 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తుందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నేరాలు లేదా వేధింపుల ఘటనలు ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారిలో వాడపల్లి ప్రస్తుత ఎస్ఐ డి. సైదులు, మిర్యాలగూడ రూరల్ ప్రస్తుత సీఐ పి.ఎన్.డి. ప్రసాద్, డీఎస్పీ జి. రవి, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎండీ అద్నాన్ అహ్మద్, లైజన్ అధికారులు హెడ్ కానిస్టేబుల్ పి. నరేందర్, కానిస్టేబుల్ ఎన్. మల్లికార్జున్ ఉన్నారు.



గజ్వేల్‌లో 2.5 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్.. మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం

ఆశ్వి అప్డేట్స్ | గజ్వేల్ | అక్టోబర్ 15

గంజాయి అక్రమ రవాణాపై గజ్వేల్ ఎక్సైజ్ పోలీసులు చర్యలు చేపట్టి, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.5 కిలోల ఎండు గంజాయితో పాటు మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

గజ్వేల్ ఎక్సైజ్ సీఐ శిరీష ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్ఐ శైలజ సిబ్బందితో కలిసి బుధవారం గజ్వేల్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి వారిని పట్టుకున్నారు.

నిందితులను బిహార్ రాష్ట్రానికి చెందిన నిరాజ్ కుమార్ (20), బిపిన్ కుమార్ (24) గా గుర్తించారు. ప్రస్తుతం వీరు ములుగు మండలం తునికి బొల్లారం గ్రామంలో ఉంటున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ శైలజ తెలిపారు. వారి నుంచి 2.5 కిలోల ఎండు గంజాయి, హీరో ప్యాషన్ ప్లస్ మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ శిరీష హెచ్చరించారు.

ఈగలు, ఎలుకల మధ్యే స్వీట్ల తయారీ

- రూ.3.78 లక్షల విలువైన ఆహార పదార్థాలు ధ్వంసం
- ఎనిమిది నమూనాలు ల్యాబ్‌కు తరలింపు
- పలు కేంద్రాలపై అధికారుల కఠిన చర్యలు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

ప్రముఖ పండుగలు, వేడుకల వేళ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్ల బాగోతం బట్టబయలైంది. భాగ్యనగరంలో ప్రజలు ఎంతో ఇష్టంగా తినే కోవా, స్వీట్ల తయారీ కేంద్రాలు అత్యంత అపరిశుభ్రంగా, రోత పుట్టించే వాతావరణంలో నడుస్తున్నట్లు ఆహార భద్రతా విభాగం తనిఖీల్లో వెల్లడైంది. తెలంగాణ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ అథారిటీ (TG SAFE) ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు చెందిన అధికారులు, పోలీస్ సిబ్బందితో కూడిన ఏడు ప్రత్యేక బృందాలు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఈ భారీ కల్తీ దందాను రట్టు చేశాయి.

జీడిమెట్లలోని భాగ్యలక్ష్మి స్వీట్స్ అండ్ బర్ఫీ, బాలాజీ మ్యాజిక్ మిఠాయి, యశోద డెయిరీలతో పాటు కీసర మండలం చీర్యాలలోని మధుర డెయిరీ ప్రొడక్ట్స్, జల్పల్లిలోని దేశీ డెయిరీ స్వీట్స్, పీర్జాదిగూడలోని జగన్నాథ్ మిల్క్ డెయిరీ, శాలిబండ బేలాలోని శంకర్ యాదవ్ కోవా అండ్ పన్నీర్ మర్చంట్‌లలో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అధికారులు నివ్వెరపోయే విజువల్స్ బయటపడ్డాయి. ఆహార వ్యర్థాలు నేలపై పడి కుళ్లిపోతుండగా, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు నిల్వ ఉంది. కిచెన్లలో గోడలు బూజుపట్టి ఉండగా, స్వీట్లపై ఈగలు ముసురుకోవడం, ఎలుకలు స్వేచ్ఛగా సంచరించడం కనిపించింది. అంతా ప్రమాదకరమైన వాతావరణంలో తినుబండారాలు తయారు చేస్తుండగా, అక్కడే గుట్కా, పాన్ మసాలా ప్యాకెట్లు పడి ఉండటం, కార్మికులు అక్కడక్కడే ఉమ్మేసిన మరకలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించాయి. సిబ్బంది కనీసం హెయిర్‌నెట్లు, గ్లౌజులు, ఆప్రాన్లు కూడా ధరించకుండానే స్వీట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు.

ఈ సోదాల్లో సుమారు రూ. 3,78,178 విలువ చేసే 2,480 కిలోల కల్తీ కోవా, లడ్డూలు తదితర ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే కల్తీపై అనుమానంతో మొత్తం 8 నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించిన కేంద్రాలపై అధికారులు కొరడా ఝళిపించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ (FSSAI) లైసెన్స్ లేకుండా, అత్యంత అపరిశుభ్రంగా నిర్వహిస్తున్న చీర్యాలలోని మధుర డెయిరీ ప్రొడక్ట్స్, జల్పల్లిలోని దేశీ డెయిరీ స్వీట్స్‌లను తక్షణమే మూసివేయాలని ఆదేశించారు. మధుర డెయిరీ, దేశీ డెయిరీతో పాటు జగన్నాథ్ మిల్క్ డెయిరీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడటంతో జీడిమెట్లలోని భాగ్యలక్ష్మి స్వీట్స్, బాలాజీ మ్యాజిక్ మిఠాయి, యశోద డెయిరీల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేస్తూ తక్షణమే ఉత్పత్తిని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో ఆటలాడితే ఎలాంటి ఉపేక్ష ఉండబోదని, నిబంధనలు పాటించని తయారీదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆహార భద్రతా విభాగం హెచ్చరించింది.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొని దుర్ఘటన

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల | అక్టోబర్ 15



నల్గొండ జిల్లా చిట్యాల మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన గౌస్ పాషా ఉరుమడ్లలో పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా, అరెగూడెం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

సంక్షేమ గురుకులాల్లో సరుకుల కొరతకు తావులేకుండా చూడాలి : మంత్రి అడ్లూరి

తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కాలేజీలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం అధికారులను ఆదేశించారు. సరుకుల సరఫరా, నిల్వలు, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, టీజీటీడబ్ల్యూఆర్ఈఐ సొసైటీల కార్యదర్శులను ఆదేశించారు. సంబంధిత సొసైటీల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలకు నిత్యావసర సరుకుల సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, ఇకపై సరఫరా వ్యవస్థపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సరుకులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో బఫర్ స్టాక్ నిర్వహించాలని స్పష్టం చేశారు. సరుకుల సరఫరా, నిల్వల పరిస్థితి, క్షేత్ర స్థాయి తనిఖీల్లో గుర్తించిన అంశాలు, సరుకుల నాణ్యత లేదా లభ్యతపై వెలువడే ప్రతికూల వార్తా కథనాలు, వాటిపై తీసుకున్న దిద్దుబాటు చర్యల వివరాలతో కూడిన సమగ్ర నెలవారీ నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రక్షాళన చేస్తాం మంత్రి వివేక్ వెంకటస్వామి

తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:

కార్మికుల సంక్షేమ నిధులను పరిరక్షించడంతో పాటు పరిపాలనలో పారదర్శకతే లక్ష్యంగా కార్మిక శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టనున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ప్రక్షాళన చేయడంతో పాటు, ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన అధికారులను త్వరలోనే బదిలీ చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి రూపాయి సక్రమంగా వినియోగమయ్యేలా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామన్నారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

కార్మిక శాఖలో క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఇద్దరు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశామని, వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించామని వెల్లడించారు. విచారణలో ఎవరిపాత్ర బయటపడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్మికుల పరిహార క్లెయిమ్‌ల పరిష్కారంలో పారదర్శకత లోపించడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి తెలిపారు. బోగస్ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా క్లెయిమ్‌లు పొందినట్లు ఆరోపణలు రావడంతో 2018 నుంచి ఇప్పటివరకు నమోదైన అన్ని రకాల క్లెయిమ్‌లను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించినట్లు చెప్పారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్థాయిలో ప్రాథమిక విచారణ జరిపి ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నామని వివరించారు. దాని ఆధారంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విజిలెన్స్ నివేదిక నెల, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తప్పు చేసిన అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. క్లెయిమ్‌ల పరిశీలన, పరిహారం మంజూరు, చెల్లింపుల బాధ్యత సంబంధిత కార్మిక శాఖ అధికారులదేనని మంత్రి తెలిపారు. బోర్డులోని విధానాలను సమీక్షించి, అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రక్రియలను మరింత పటిష్ఠం చేస్తామన్నారు. వివిధ సంస్థలు, నిర్మాణదారుల నుంచి వసూలు కావాల్సిన వందల కోట్ల రూపాయల లేబర్ సెస్సును నిబంధనల ప్రకారం పెనాల్టీలతో సహా వసూలు చేస్తామని వెల్లడించారు.

తన సిఫారసు లేఖ ఆధారంగా కార్మికుల పరిహార క్లెయిమ్ మంజూరైనట్లు వచ్చిన కథనాలు అవాస్తవమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులను ఆశ్రయించడం సహజమని, సంబంధిత అధికారులకు నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించడం సాధారణ విధానమని చెప్పారు. తన వద్దకు వచ్చిన దరఖాస్తుపై నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మాత్రమే సూచించానని వివరించారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో ఆ దరఖాస్తును తిరస్కరించారని, దరఖాస్తుదారుడికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం చెల్లించలేదని తెలిపారు. చెల్లింపే జరగనప్పుడు తన సిఫారసుతో క్లెయిమ్ మంజూరైనట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. సింగరేణి సంస్థ పరిస్థితిపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య లక్ష నుంచి 38 వేలకు పడిపోయిందని, దాదాపు 62 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని అన్నారు. ఆ పదేళ్లలో ఒక్క కొత్త బొగ్గు గని కూడా సంస్థకు రాలేదని పేర్కొన్నారు.







దేశంలోని అన్ని జిల్లాల్లో AIPC కమిటీల ఏర్పాటు

- **చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కీ గౌడ్**
- **ప్రొఫెషనల్స్‌ను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేస్తాం**

ఆశ్వి అప్డేట్స్ | న్యూఢిల్లీ | అక్టోబర్ 15

ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (AIPC) నూతన చైర్మన్‌గా మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని ఏఐసీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి నుంచి ఆయన బాధ్యతలు అందుకున్నారు. వీడియో కాల్ ద్వారా సామ్ పిట్రోడా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, చైర్మన్ పదవిని హోదాగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నానన్నారు. దేశవ్యాప్తంగా 50 వేల సభ్యత్వంతో పాటు 100 పట్టణ జిల్లాల్లో AIPC కమిటీలను విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వైద్యులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు సహా వివిధ రంగాల నిపుణులను ఒక వేదికపైకి తీసుకొచ్చి, విధాన రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు ప్రొఫెషనల్స్ రాజకీయ, సామాజిక రంగాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధికి నిపుణుల అనుభవం, ఆలోచనలు ఉపయోగపడేలా AIPC కృషి చేయాలని సూచించారు.

వీడియో కాల్‌లో మాట్లాడిన సామ్ పిట్రోడా దేశంలోని అన్ని జిల్లాల్లో AIPC కమిటీలను ఏర్పాటు చేసి, వివిధ వృత్తులకు చెందిన నిపుణులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సందర్భంగా AIPC నూతన గీతాన్ని దీపా దాస్ మున్షీ విడుదల చేశారు.

ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు దీపా దాస్ మున్షీ, రాజ్‌పాల్ గౌతమ్, సీడబ్ల్యూసీ సభ్యులు గురుదీప్ సింగ్ సప్పల్, రాజ్యసభ ఎంపీ దీపేందర్ హుడా, మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ తదితరులు హాజరయ్యారు.

లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం

- **సిద్దిపేటలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**
- **రేపు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనం**

ఆశ్వి అప్డేట్స్ | సిద్దిపేట | అక్టోబర్ 15

సిద్దిపేట పట్టణంలోని కల్లకుంట కాలనీ లలితా నగర్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ అష్టలక్ష్మీ సహిత లలితా పరమేశ్వరీ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయ నిర్వాహకులు జి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమం నిర్వహించగా, భక్తులు



పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతిరోజూ చండీ హోమం నిర్వహిస్తున్నట్లు వైదిక నిర్వాహకులు పూసాల వెంకటాచార్యులు తెలిపారు.

రేపు సరస్వతీ దేవి అలంకారం

మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం, అక్టోబర్ 16న అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ



నిర్వాహకులు జి. కిరణ్ కుమార్, ప్రధాన అర్చకులు కృపాకరాచార్యులు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

అర్హులందరికీ ఆర్థిక పథకాల ప్రయోజనాలు

- **అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు**
- **ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ కె. హైమావతి**

ఆశ్వి అప్డేట్స్ | సిద్దిపేట | అక్టోబర్ 15

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆవిష్కరించారు.

ఈ ప్రచారంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ప్రత్యేక అవగాహన, సేవా శిబిరాలను నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులకు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. అలాగే ఆధార్ అనుసంధానం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సేవలను ఈ శిబిరాల ద్వారా అందించనున్నారు. ప్రభుత్వ



పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా బ్యాంకులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తెలంగాణ ఇంటర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల..

తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్

తెలంగాణలో మార్చి 2027లో జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారికంగా విడుదల చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ఫెయిలైన విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఈ షెడ్యూల్ వర్తిస్తుంది. అలాగే, కాలేజీకి వెళ్లకుండా నేరుగా హాజరు మినహాయింపు పొందిన ప్రైవేట్ అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9, 2026 వరకు తమ పరీక్ష ఫీజును చెల్లించడానికి అవకాశం కల్పించారు. ఒకవేళ ఆ గడువులోగా చెల్లించలేని విద్యార్థుల కోసం ఆలస్య రుసుముతో కూడిన గడువులను కూడా ప్రకటించారు. రూ. 100 ఆలస్య రుసుముతో నవంబర్ 11 నుంచి నవంబర్ 20 వరకు, అలాగే రూ. 500 ఆలస్య రుసుముతో నవంబర్ 22 నుంచి నవంబర్ 29, 2026 వరకు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. కాబట్టి విద్యార్థులందరూ ఎలాంటి చివరి నిమిషపు ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణయించిన గడువులోగా తమ కళాశాలల ద్వారా ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు.



ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి

- **బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే మేఘారెడ్డి విమర్శలు**
- **ఏదుల, రేవల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

ఆశ్వి అప్డేట్స్ | ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | అక్టోబర్ 15

ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయకుండా, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఇప్పుడు మరోలా మాట్లాడటం బీఆర్ఎస్ నాయకుల రాజకీయాలకు నిదర్శనమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. గురువారం రేవల్లి, ఏదుల మండలాల్లోని బండరావిపాకుల, కొంకలపల్లి, ఏదుల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వనపర్తి పట్టణంలోని పీజీ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏదుల ప్రాజెక్టు కోసం సుమారు 2,500 ఎకరాల భూములిచ్చిన రైతులకు గత పాలకుల హయాంలో రూ.25 లక్షల పరిహారం ఎందుకు చెల్లించలేదో బుద్ధారంలో ధర్నాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు రావాల్సిన రూ.12.50 లక్షల పరిహారాన్ని త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏదుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం



ఏదులలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ధాన్యపు గోదాం, కొంకలపల్లిలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ధాన్యపు గోదాం, ఏదుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, రేవల్లి, ఏదుల మండలాల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ**

ఆశ్వి అప్డేట్స్ | మేడ్చల్ | అక్టోబర్ 15

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ పాటలతో పండుగ సందడిని పంచుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతను చాటుతుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్, వైస్ చైర్‌పర్సన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా, ఐకమత్యంతో ఆనందంగా జరుపుకోవాలని మున్సిపల్ అధికారులు కోరారు.

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా సుంకు నవీన్

- **తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు**

ఆశ్వి అప్డేట్స్ | మేడ్చల్ | అక్టోబర్ 15



బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సుంకు నవీన్ కుమార్ ముదిరాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, తనకు ఈ బాధ్యత అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సుంకు నవీన్ కుమార్ ముదిరాజ్ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

- **రైతులను ఆదుకోవాలి.. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి**
- **మంద వేణుగోపాల్ రెడ్డి డిమాండ్**

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల | అక్టోబర్ 15



ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైస్ మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లులపై సివిల్ సప్లయిస్ అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని మంద వేణుగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అధికారుల నిర్లక్ష్యం.. రోడ్డుపై గుంతలను పూడ్చిన గ్రామ పాలకవర్గం

- **రిమ్మనగూడ–బూరుగుపల్లి రహదారిపై కాంక్రీట్‌తో మరమ్మతులు**
- **కెనాల్ బ్రిడ్జి వద్ద శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తుల విజ్ఞప్తి**

ఆశ్వి అప్డేట్స్ | గజ్వేల్ | అక్టోబర్ 15

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని రిమ్మనగూడ నుంచి బూరుగుపల్లికి వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని నెలలుగా రోడ్డుపై భారీ గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించేవారు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను గుర్తించిన బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలోని పాలకవర్గం ముందుకు వచ్చి, రహదారిపై ఉన్న గుంతలను కాంక్రీట్‌తో పూడ్చే పనులు చేపట్టింది. ప్రజల భద్రత, ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. అయితే, కెనాల్ బ్రిడ్జి వద్ద రహదారిని శాశ్వతంగా మరమ్మతు చేసి, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషోర్ రెడ్డి, నాయకులు సీహెచ్. రాజు, వార్డు సభ్యులు భాస్కర్ రెడ్డి, రజినీకాంత్, కిరణ్, అరవింద్ రెడ్డి, స్వామి, సాయిలు, నర్సింలు, శివులు తదితరులు పాల్గొన్నారు.



పండగల వేళ నిరసనలతో
వ్యాపారులకు నష్టం

- **దీపావళి వరకు ఆందోళనలకు అనుమతివ్వొద్దని అమిత్ షాకు వ్యాపార సంఘం లేఖ**
- **అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిరసన**
- **అక్టోబర్ 10 ఆందోళనతో రూ.2,000 కోట్ల నష్టం**
- **ఢిల్లీలో 20 లక్షల మంది వ్యాపారులపై ప్రభావం పడే అవకాశం**



న్యూఢిల్లీ, అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్:

వరుస నిరసనలు, ప్రదర్శనలతో పండగల సీజన్‌లో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఢిల్లీలోని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి సమయంలో రాజకీయ పార్టీల ఆందోళనల వల్ల మార్కెట్లకు వినియోగదారుల రాక తగ్గుతోందని పేర్కొంటున్నారు. దీపావళి ముగిసే వరకు రాజధానిలో నిరసనలు, ప్రదర్శనలకు అనుమతివ్వవద్దని కోరుతూ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాసింది.

అక్టోబర్ 16న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్నాట్ ప్లేస్‌లో నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వ్యాపార సంఘం ఈ అంశాన్ని లేవనెత్తింది. ఈ ఆందోళనతో కన్నాట్ ప్లేస్, జన్‌పథ్, ఖాన్ మార్కెట్ వంటి ప్రధాన వాణిజ్యప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని సీటీఐ పేర్కొంది. రహదారులు దిగ్బంధమైతే వినియోగదారులు షాపింగ్‌కు రావడం తగ్గుతుందని, తద్వారా వ్యాపారాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది.

రూ.2,000 కోట్ల నష్టం అంచనా

అక్టోబర్ 10న జరిగిన సీజేపీ నిరసనల కారణంగా ఢిల్లీలో లాక్‌డౌన్ తరహా పరిస్థితులు ఏర్పడ్డాయని సీటీఐ తెలిపింది. ఆ రోజు మార్కెట్లకు వినియోగదారుల రాక తగ్గడంతో సుమారు రూ.2,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లినట్లు అంచనా వేసింది. నవరాత్రులు, దీపావళి వంటి కీలక పండగల సమయంలో ఇలాంటి ఆందోళనలు కొనసాగితే వ్యాపారాలపై మరింత ప్రభావం పడుతుందని పేర్కొంది.

ఢిల్లీలో సుమారు 20 లక్షల మంది వ్యాపారుల జీవనోపాధిపై నిరసనల ప్రభావం పడే అవకాశం ఉందని సీటీఐ ఆందోళన వ్యక్తం చేసింది. పండగల సీజన్‌లో మార్కెట్లకు వచ్చే వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా, వ్యాపార కార్యకలాపాలు సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిని కోరింది.



వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి
ప్రత్యేక ప్రాధాన్యం

- **పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్**
- **కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల తనిఖీ**


వరంగల్, అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్ :

వరంగల్ జిల్లాలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమల పురోగతికి అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అధికారులకు సూచించారు. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఆయన గురువారం సందర్శించారు. పార్కులో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కిటెక్స్, యంగ్‌వన్, గణేశా కంపెనీలనుంగా తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తి కార్యకలాపాలు, పనితీరును పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో ముచ్చటించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వరంగల్ ప్రాంతంలో వస్త్ర పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పించాలని, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని అధికారులను ఆయన ఆదేశించారు. వస్త్ర పరిశ్రమ రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానికంగా పరిశ్రమల విస్తరణకు, ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి పరిశ్రమలకు అవసరమైన సహకారాన్ని సకాలంలో అందించాలని సబ్యసాచి ఘోష్ సూచించారు. కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, చేనేత, వస్త్ర శాఖ అదనపు సంచాలకుడు ఎన్.వెంకటేశ్వరరావు, ఏడీ శ్రీకాంత్ రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, నారాయణరెడ్డి, టీటీడీవో, సంగెం తహసీల్దార్ జి.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

లలితా మహా త్రిపుర సుందరిగా భద్రకాళి

వరంగల్, , అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్:

వరంగల్ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు గురువారం అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించి అమ్మవారిని లలితా మహా త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు జరిపారు. ఉదయం పల్లకీ సేవ, సాయంకాలం శేష వాహన సేవ జరిపారని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. గురువారం కార్యక్రమాలకు వాగ్దేవి విద్యా సంస్థల అధినేతలు చందుపట్ల దేవేందర్ రెడ్డి - వాణీదేవి, వాహినీదేవి, కళా సారీస్ అండ్ ఫ్యాబ్రిక్స్ అధినేతలు పింగిళి పవన్ రెడ్డి శ్రీలత, పల్లె లక్ష్మిణావుగౌడ్ సువర్ణ ఉభయదాతలుగా వ్యవహరించారు. ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈఓ రామల సునీత పర్యవేక్షించారు. భక్తులందరికీ శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.



మతం మారితే కుల రిజర్వేషన్ వర్తించదు: సుప్రీంకోర్టు

- **ముస్లిం బీసీ రిజర్వేషన్లపై తమిళనాడు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ**
- **మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం**
- **మత మార్పిడితో కుల గుర్తింపు స్వయంచాలకంగా రాదని స్పష్టీకరణ**
- **2024లో తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన జీవోపై వివాదం**



న్యూఢిల్లీ, అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్:

మతం మారినంత మాత్రాన మరో సామాజిక వర్గానికి చెందిన కుల గుర్తింపు, రిజర్వేషన్ అర్హతలు స్వయంచాలకంగా లభించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన వారికి ముస్లిం వెనుకబడిన తరగతుల (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించే అంశంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ వ్యవహారంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కుల ఆధారిత సామాజిక గుర్తింపు, రిజర్వేషన్ అర్హతలకు సంబంధించి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది.

వివాదానికి కారణమైన జీవో

తమిళనాడు ప్రభుత్వం 2024 మార్చిలో జారీ చేసిన జీవో ఈ వివాదానికి కారణమైంది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ), షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) నుంచి ఇస్లాంలోకి మారిన వారు ముస్లిం వెనుకబడిన తరగతుల (బీసీఎం) కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు పొంది రిజర్వేషన్ ప్రయోజనాలు పొందేందుకు ఈ ఉత్తర్వులు వీలు కల్పించాయి. అయితే, ఈ నిర్ణయం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ జీవోను రద్దు చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

మత మార్పిడితో కుల గుర్తింపు రాదు

మతం మారినంత మాత్రాన వ్యక్తులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫారసుల ఆధారంగానే జీవో జారీ చేశామని, ఇప్పటికే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్నవారు మత మార్పిడి కారణంగా వాటిని కోల్పోకూడదనే ఉద్దేశం ఉందని వివరించింది.

అయితే, తమిళనాడులో బీసీఎం కేటగిరీ కింద గుర్తించిన అన్సార్, దక్కనీ ముస్లింలు, దూదేకుల, లబ్బాయి, మాపిళ్ల, షేక్, సయ్యద్ వంటి ఏడు సామాజిక వర్గాల్లోకి మతం మారినంత మాత్రాన ఎవరూ స్వయంచాలకంగా చేరలేరని హైకోర్టు పేర్కొంది. ఆయా వర్గాల సామాజిక గుర్తింపునకు సంబంధించిన నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

కమ్యూనిటీ సర్టిఫికెట్ కోసం పోరాటం

2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన సమీర్ అహ్మద్ అనే వ్యక్తి, తనకు ముస్లిం లబ్బాయి సామాజిక వర్గానికి చెందిన కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఆ దరఖాస్తును తిరస్కరించడంతో ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలోనే తమిళనాడు ప్రభుత్వం 2024లో జారీ చేసిన జీవో చట్టబద్ధతపై వివాదం తలెత్తింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించడంతో ఈ అంశంపై న్యాయపరమైన చర్చ మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది.

సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

- **కన్నాట్ ప్లేస్ ఆందోళనను అడ్డుకునేందుకు కోర్టు నిరాకరణ**
- **శాంతిభద్రతలు కాపాడాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశం**
- **అభిజిత్ దీపేకు పిలుపుతో అక్టోబర్ 16న నిరసన**
- **సీజేపీ కోకన్వీనర్లకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**



న్యూఢిల్లీ, అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్:

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టనున్న నిరసనను నిలిపివేయడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 16న జరగనున్న ఆందోళనను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకుంది. నిరసనను నియంత్రించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని ధర్మాసనం నమోదు చేసింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించింది. పండగల సీజన్‌లో నిరసనల కారణంగా సెంట్రల్ ఢిల్లీలో దుకాణాలు మూతపడుతున్నాయని, దీంతో వ్యాపారులు నష్టపోతున్నారని కన్నాట్ ప్లేస్‌కు చెందిన వ్యాపారి తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఆందోళనలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ స్పందిస్తూ.. సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నామని, పిటిషనర్ ఆందోళనలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అక్టోబర్ 16న సెంట్రల్ పార్క్‌లో నిరసన

సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీపే అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్ద నిరసనకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, జాతీయ జెండాలతో రావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాలతో నిరసన తెలుపుతున్న సీజేపీ కోకన్వీనర్లు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగినట్లు తెలుస్తోంది.

జాతీయ జెండాపై కొనసాగుతున్న వివాదం

తమ నేతల అరెస్టుల నేపథ్యంలో సీజేపీ కొత్త నిరసనకు పిలుపునిచ్చింది. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు జైలుకు పంపిస్తారా? అంటూ సీజేపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు, కన్నాట్ ప్లేస్‌లో నిరసన సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

భారత రక్షణ రంగానికి దశ-దిశ చూపిన మహనీయుడు

- **అబ్దుల్ కలాంకు బీజేపీ చీఫ్ రామచందర్ రావు నివాళులు**
- **సాగునీరు, విద్యుత్ కొరతతో రైతుల అరిగోస**
- **పాలనను గాలికొదిలేసి వోట్ చోరీ డ్రామాలాడుతున్న కాంగ్రెస్**

హైదరాబాద్,అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్ :

మాజీ రాష్ట్రపతి, దేశం గర్వించదగ్గ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా భారతరత్న డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం తన అసాధారణ ప్రతిభాపాటవాలతో భారత రాష్ట్రపతిగా, దేశ రక్షణ రంగంలో అత్యున్నత క్షిపణులు, రాకెట్ వ్యవస్థలను ఆవిష్కరించి జాతిని అగ్రరాజ్యాల సరసన నిలిపారని కొనియాడారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోలో పనిచేస్తూ దేశ రక్షణకు అవసరమైన ఎన్నో సాంకేతిక పరిజ్ఞానాలను అందించారని ఆయన గుర్తు చేశారు. వాజ్‌పేయి నాయకత్వంలో పోఖ్రాన్‌లో విజయవంతంగా నిర్వహించిన అణుపరీక్షలతో యావత్ ప్రపంచం భారతదేశ సత్తాను గుర్తించి ఆశ్చర్యపోయిందన్నారు. అయితే దేశ గౌరవాన్ని పెంచిన అబ్దుల్ కలాంను, అణుపరీక్షలను సైతం కాంగ్రెస్ పార్టీ కించపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పార్లమెంటు వేదికగా సోనియా గాంధీ, చిదంబరం లాంటి నేతలు కలాంను 'బాంబ్ మ్యాన్' అంటూ హేళన చేస్తూ మాట్లాడిన రికార్డులు ఉన్నాయన్నారు. నేటి యువత అబ్దుల్ కలాం నిస్వార్థ దేశ భక్తిని ఆదర్శంగా తీసుకుని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



దివ్యాంగులకు కేంద్రం చేయూత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం నాటి కేంద్ర మంత్రివర్గ సమావేశం ఉద్యోగులు, దివ్యాంగుల సంక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని రామచందర్ రావు తెలిపారు. రైల్వే శాఖలోని 11.4 లక్షల మంది ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక ఆధారిత బోనస్ కింద రూ.2,009.61 కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతేకాక జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద గతంలో 80 శాతంగా ఉన్న వైకల్య అర్హత ప్రమాణాన్ని 40 శాతానికి తగ్గించడం ద్వారా లక్షలాదిమంది దివ్యాంగులకు చేయూతనిచ్చిందని పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు: సీజేఐ

- **రాహుల్‌గాంధీ పిటిషన్ విచారణలో సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు**
- **సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రపై గౌరవ్ భాటియా అభ్యంతరం**
- **ఒత్తిళ్లకు న్యాయవ్యవస్థ తలొగ్గదన్న ప్రధాన న్యాయమూర్తి**
- **జంతర్ మంతర్ నిరసనలపై పిటిషన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 15, ఆశ్వి అప్డేట్స్:

న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' రద్దు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు రాహుల్‌గాంధీ పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ అంశం చర్చకు వచ్చింది.


ఒత్తిళ్లకు తలొగ్గబోం

సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపులు నిర్వహించడం ఆమోదయోగ్యం కాదని గౌరవ్ భాటియా అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలుగా మారవచ్చని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. న్యాయవ్యవస్థ వాస్తవ ప్రపంచానికి దూరంగా లేదని, బయట జరుగుతున్న పరిణామాలన్నీ తమకు తెలుసని అన్నారు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని, ఇలాంటి ప్రయత్నాలు బలహీనమైనవని వ్యాఖ్యానించారు.

జంతర్ మంతర్ అంశంపై నోటీసులు



మరోవైపు, ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన అంశం కూడా సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జంతర్ మంతర్‌ను జాబితా నుంచి తొలగించలేదని, ఒక కమిటీ ఆ మేరకు సిఫారసు చేసిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తొలుత ప్రభుత్వం స్పందనను పరిశీలిస్తామని, ఆ సమాధానంతో సంతృప్తి చెందకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ధర్మాసనం పేర్కొంది.



డెస్క్ జాబ్‌లంటే రిస్కే సుమీ...

మీరు గంటల తరబడి ఒకేచోట కూర్చొని పనిచేస్తున్నారా..? అయిత మీరు అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నట్లే.. గంటల తరబడి ఒకేచోట కూర్చొని పనిచేసేవారికి ఊబకాయం, పొట్ట పెరగడం, మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం, స్ట్రోక్, క్యాన్సర్, చెడు కొలెస్ట్రాల్, గుండెపోటు, సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా వస్తున్నట్లు డెస్క్ జాబ్ చేసేవారిపై చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుత రోజుల్లో యువత డెస్క్ జాబ్‌లవైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. కానీ ఇవి ఎంత ప్రమాదకరమైనవో ఆలస్యంగా తెలుసుకుంటున్నారు. ఏసీలో గంటల తరబడి కూర్చొని జాబ్ చేయాలని కలలు కంటే పర్వాలేదు.. కానీ దానితో పాటు వ్యాధులను తట్టుకునే శక్తి కూడా ఉండాలని తెలుసుకోండి. డెస్క్ జాబ్‌లో ఉదయం నుంచి మొదలు సాయంత్రం, రాత్రి వరకు ఒకేచోట గంటల తరబడి కూర్చొని పనిచేయాలి. ఇలా కూర్చొవడం అనేది డ్రింకింగ్, స్మోకింగ్ చేసేవారికంటే చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా ఓ అధ్యయనంలో డెస్క్ జాబ్‌లు చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయో తెలిసింది. వాటి గురించి ఈ రోజు తెలుసుకుందాం.

ప్రమాదకర వ్యాధులు...


డెస్క్ జాబ్‌లు చేసేవారికి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్లు ఈ పరిశోధనలో వెల్లడైంది. ఒకేచోట 8 నుంచి 10 గంటలు కూర్చొని పనిచేసేవారికి జీవక్రియకు సంబంధించిన అనేక వ్యాధులు, టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే అధిక కొలెస్ట్రాల్ పెరిగి విపరీతంగా బరువు పెరుగుతారు.

పరిష్కార మార్గం...

ఈ ఆరోగ్య సమస్యలు, వ్యాధుల బారిన పడకూడదంటే డెస్క్ జాబ్‌లు చేసేవారు ప్రతి ఒక్కరూ ప్రతి గంటకు ఒక్కసారి లేచి కాస్త రిలాక్స్ కావాలని నిపుణులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం కాస్త శారీరక శ్రమ ఉండేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు. లేదంటే కొంత సమయం నిల్చుని పనిచేయాలంటున్నారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం ద్వారా కాళ్లకు రక్తప్రసరణ జరిగి బాడీ నుంచి చెమట బయటకు వెళ్లిపోయి గుండె జబ్బులలాంటివి రాకుండా ఉంటుందని చెబుతున్నారు.

అకాల మరణం...

గంటల తరబడి ఒకేచోట కూర్చొని పనిచేసేవారికి ఊబకాయం, పొట్ట పెరగడం, మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం, స్ట్రోక్, క్యాన్సర్, చెడు కొలెస్ట్రాల్, గుండెపోటు, సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా వస్తున్నట్లు డెస్క్ జాబ్ చేసేవారిపై చేసిన అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాదు కొంతమంది కూర్చొన్న చోటే చనిపోయే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. మనిషికి కచ్చితంగా శారీరక శ్రమ చేయడం అవసరం. అందుకే డెస్క్ జాబ్‌లు చేసేవారు ప్రతి గంటకు ఒకసారి లేచి వాకింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి.





థైరాయిడ్‌కి ఇలా చెక్ పెట్టండి..!

ప్రస్తుత రోజుల్లో అనేక మంది థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్నారు. వారికి థైరాయిడ్ ఉందన్న విషయాన్ని లేటుగా గుర్తిస్తున్నారు. థైరాయిడ్ సమస్య వచ్చినప్పుడు గొంత దగ్గర వాపు ఏర్పడుతుంది. దీనివల్ల అనేక ఇతర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. మెడ కింది భాగంలో ఉండే చిన్న సీతాకోక చిలుక గ్రంధిని థైరాయిడ్ గ్రంథి అంటారు. ఇది థైరాక్సిన్, ట్రైఅయోడోథైరోనిన్ అనే రెండు ముఖ్యమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు శరీరం, పనితీరుకు చాలా అవసరం. ఇది రాకుండా ఉండాలంటే ఎలాంటి ఫుడ్స్ డైట్‌లో ఉండాలో తెలుసుకుందాం.







థైరాయిడ్ గ్రంథి తక్కువ పరిమాణంలో హార్మోన్లను ఉత్పత్తి చేస్తే దాన్ని హైపోథైరాయిడిజం అంటారు. థైరాయిడ్ గ్రంధి అధిక మొత్తంలో హార్మోన్లను ఉత్పత్తి చేస్తే దానిని హైపర్ థైరాయిడిజం అంటారు. ఈ రెండు బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే అది మీరు తీసుకున్న ఆహారంపై ఆధారపడి ఉంటుంది. థైరాయిడ్ వచ్చిన తర్వాత ఇబ్బందిపడేకంటే రాకుముందే ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. థైరాయిడ్ రాకూడదంటే వివిధ రకాల పండ్లు, కూరగాయలు, గింజలు, తృణధాన్యాలు తినాలి. ప్రోటీన్ కోసం, చేపలు లేదా బీన్స్ వంటి తక్కువ కొవ్వు ఉన్నవాటిని ఎంచుకోవాలి. వంటలో ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన నూనెలను ఉపయోగించాలి.

చేపలలో ఉండే ఒమేగా3 కొవ్వులు చాలా మేలు చేస్తాయి. ఇది కాకుండా విత్తనాలు, గింజలు, చిక్కుళ్లు తీసుకోవాలి. ఫైబర్ సరైన జీర్ణక్రియను మెయింటెన్ చేయడానికి సాయపడుతుంది. తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు తినడం ద్వారా మీరు తగినంత మొత్తంలో ఫైబర్ పొందవచ్చు. అయోడిన్ మాత్రలు తీసుకోవడం లేదా అయోడిన్ అధికంగా ఉన్న ఆహారాన్ని తినడం మంచిదికాదు. ఇది థైరాయిడ్ హార్మోన్ స్థాయిలను దెబ్బతీస్తుంది. అయినప్పటికీ ఉప్పు పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. ఇది శరీరాన్ని బ్యాలెన్స్‌డ్‌గా ఉంచుతుంది.

మీలో ఈ లక్షణాలుంటే..
సోషల్ మీడియాకు అడిక్ట్ అయినట్లే...

ఓ సర్వే ప్రకారం సోషల్ మీడియాలో కంటిన్యూగా 3 గంటలు గడిపే టీనేజర్లలో యాంగ్జైటీ, కోపం, నిరాశ వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిసింది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే మనిషికి కంటినిండా నిద్ర అనేది చాలా అవసరం. ఇది బాడీని రిచార్జ్ చేస్తుంది. హుషారుగా పనిచేసుకోవడానికి సహకరిస్తుంది. సోషల్ మీడియాకి బానిసైపోవడం వల్ల రాత్రిపూట ఎవరూ సరిగ్గా నిద్రపోవడం లేదని సర్వేలో వెల్లడైంది. చాలామంది నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నట్లు బయటపడింది.

ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు వారు సోషల్ మీడియాని అంటిపెట్టుకుని ఒకేచోట గంటలు గంటలు గడిపేవారు ఉన్నారు. ఒకే చోట కూర్చొని లేదా పడుకొని వీడియోలు చూడటం వల్ల విపరీతంగా బరువు పెరిగిపోయి, ఊబకాయం భారినపడే అవకాశాలు ఉన్నాయి. ఇది కాకుండా సోషల్ మీడియా వల్ల యూత్ తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. ఏ పని మీద ఏకాగ్రత పెట్టకపోవడం వల్ల కొత్తగా ఏదీ నేర్చుకోలేకపోతున్నారు. కెరియర్‌లో మిగతావారితో పోలిస్తే వెనుకబడుతున్నారు. అందుకే సోషల్



రోజులు మారుతున్న కొద్ది స్మార్ట్ ఫోన్ వాడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. తినకుండానైనా ఉండగలుగుతున్నారు కానీ స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా లేకుండా ఉండలేక పోతున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అందులో ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ లాంటి సోషల్ మీడియాలో అకౌంట్ క్రియేట్ చేసుకుని గంటల తరబడి అందులోనే లీనమైపోతున్నారు. సెల్ సౌండ్ అయిందంటే చాలు నా ఫొటోకు లైక్ కొట్టారా, నా వీడియోకి కామెంట్ చేశారా అంటూ తరచుగా ఫోన్ చూస్తూ ఉంటున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ దీనికి అడిక్ట్ అయి అనేక మంది ఆరోగ్య సమస్యలు

బాధ్యతలు చేపట్టిన సావిత్రి



“అబ్జెక్షన్ ఓవర్‌రూల్డ్..! సావిత్రి బాధ్యతలు చేపట్టారు.. అది కూడా అద్భుతమైన శైలిలో” అంటూ ‘సత్యవాన్ సావిత్రి’ ప్రపంచాన్ని పరిచయం చేసింది చిత్రబృందం. కీర్తిసురేశ్, దర్శకుడు మిస్కిన్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రమిది. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్. శక్తివేల్ నిర్మిస్తున్నారు. బాల శరవణన్, శిల్పా మంజునాథ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా నవంబరు 20న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ చిత్ర టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ‘ఒకవేళ మీకు ఈ కేసులో ఏకపక్షంగా తీర్పు ఇవ్వమని రూ.పదిలక్షలు లంచం ఇస్తే.. మీరు అది ఎక్కడ తీసుకుంటారు’ అంటూ కీర్తి కోర్టురూమ్‌లో అడిగిన ప్రశ్నతో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం వినోదభరితంగా సాగుతోంది. చివరిగా ‘నాకు ‘లా’ అంటే చాలా ఇష్టం. పెద్ద న్యాయవాది అవ్వాలని ఆశపడి చదివాను. నా జీవితంలో ఒకే ఒక్క ఆశయం.. మార్కండేయ సర్‌లాగా లాయర్ అవ్వాలి’ అనే డైలాగ్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుందీ టీజర్.

హృదయం నిండుగా



కథానాయకుడు ప్రభాస్ పంపిన విందు భోజనాన్ని చూపుతూ ‘హృదయం, కడుపు ఎప్పటికీ నిండుగా...’ అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు కథానాయిక ఇమాన్వి. ఈ సందర్భంగా ఆమె ప్రభాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తొలి చిత్రంలోనే ప్రభాస్ సరసన నటించే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఇమాన్వి. ప్రభాస్ - హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఫౌజీ’లో కథానాయిక ఇమాన్వినే. ఈ నెల 13న ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా హీరో ప్రభాస్ ప్రత్యేకమైన వంటకాల్ని సిద్ధం చేయించి, తన కథానాయికకు విందు భోజనాన్ని పంపించారు. ఆ వంటకాల్ని చూసి ఆశ్చర్యపోయిన ఇమాన్వి... ఫొటోల్ని వీడియోల్ని ఇన్‌స్టాలో పంచుకున్నారు. ఆతిథ్యం ఇవ్వడంలో ప్రభాస్‌కి ఎంతో పేరుంది. తన తోటి నటుల కోసం ప్రత్యేకంగా వంటకాలు చేయించి పంపుతుంటారు. ఆయన అభిరుచి గురించి నటులు ప్రత్యేకంగా మాట్లాడుకుంటుంటారు. ఇమాన్వి కూడా ప్రభాస్ ఆతిథ్యం చూసి ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యారు. ‘ఫౌజీ’ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.



రామోజీ ఫిల్మ్ సిటీలో డ్రాగన్ యాక్షన్

‘డ్రాగన్’ అవతారంలో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు అగ్రహీరో ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. గాయం కారణంగా కొన్ని రోజులుగా ఎన్టీఆర్ షూటింగ్ నుంచి విరామం తీసుకున్నా.. ఈ సినిమా చిత్రీకరణ మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడాయన గాయం నుంచి కోలుకొని మళ్లీ సెట్లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ సన్నివేశాల్ని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరిస్తున్నారు. ఎన్టీఆర్‌తో పాటు ఇతర తారాగణంపై ఈ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో అనిల్ కపూర్, బిజూ మేనన్, ఖుష్బూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్టీఆర్.. లూగర్ అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది


పెళ్లి చేసుకునేది పనిమనిషి అవ్వడం కోసం కాదు..



యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘క్రేజీ కల్యాణం’. ఈ సినిమా రిలీజ్‌కు రాబోతుండగా.. ప్రమోషన్స్‌లో పాల్గొన్న అనుపమ తన పెళ్లిపై షాకింగ్ కామెంట్స్ చేసింది. ‘ఈ సినిమాలో నాకు పెళ్లి అవుతుందా కాదా అనేది పక్కకి పెడితే..ఇందులో నా పెళ్లిపై చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ అలా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా వాళ్లు అంటారు. నాకైతే పెళ్లికి ముందే ఒక బేబీని కనాలనిఉంది. భవిష్యత్తులో నాకు అసలు పెళ్లవుతుందో లేదో నాకేక్లారిటీ లేదు. కానీ, ఒక పాపనో, బాబునో పెంచుకోవాలనే కోరిక మాత్రం బలంగా ఉంది. అది అడాప్షన్ ద్వారానో లేదా ఐవీఎఫ్ ద్వారానో ఎలాగైనా సాధ్యమే కదా’ అంటూ ఓపెన్ అయింది. అలాగే దాంపత్య జీవితంలో భార్యాభర్తల సమానత్వం గురించి మాట్లాడుతూ.. ‘పెళ్లి చేసుకునేది ఉచితంగా వచ్చే పనిమనిషి కోసం కాదు. ఆడపిల్లల బాధ్యత కేవలం వంటింటికే పరిమితం కాకూడదు. బయటకు వెళ్లి అలిసిపోయి ఇంటికి వచ్చాక మహిళ ఒక్కతే వంటింట్లోకి వెళ్లి వంట చేయాల్సి రావడం, పురుషులు విశ్రాంతి తీసుకోవడం సరైన పద్ధతి కాదు. ఇంట్లో పనులను ఇద్దరూ సమానంగా పంచుకోవాలి. కనీసం ఆమెకు తోడుగా నిలిచే భాగ్యస్వామ్యం ఉండాలి’ అని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

ఇండస్ట్రీలో రాజకీయాలు ఎక్కువ..

1990లలో ఉత్తరాంధ్ర జానపద కళారూపమైన బుర్రకథను ప్రజల్లోకి తీసుకెళ్లిన లెజెండరీ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెకకెక్కుతోన్న మూవీ ‘గరివిడి లక్ష్మి’. యంగ్ హీరోయిన్ ఆనంది ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇండస్ట్రీపై షాకింగ్ కామెంట్స్ చేసింది హీరోయిన్ ఆనంది. ‘సినిమా ఫీల్డ్‌కు నేను సరిపోనేమో అని అప్పుడప్పుడు నాకు అనిపిస్తుంది. సినిమాలు చేయడానికి ఎన్నో లెక్కలు, రాజకీయాలు ఉంటాయి. ఇక్కడ చాలా విషయాలు జరుగుతుంటాయి. ఎందుకు సినిమాలు చేస్తున్నావు అని నా మీద నాకే ఒక క్వచ్చన్ మార్క్ వచ్చినప్పుడు.. మీ ప్రేమ, మద్దతే నన్ను మందుకు తీసుకెళ్తున్నాయి. నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇండస్ట్రీ నన్ను గుర్తించినా, గుర్తించకపోయినా ప్రేక్షకులు మాత్రం నా నటనను గుర్తు పెట్టుకుంటున్నారు. నేను చేసిన ప్రతి పాత్రను గుర్తుచేసుకుంటూ.. నాకు అవార్డులు రావాలని కోరుకుంటూ అభిమానులు ప్రస్తావించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఈ ఆదరణ నాకు దక్కిన అతిపెద్ద గౌరవం. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటా’ అంటూ స్టేజ్‌పైనే ఎమోషనల్ అయింది ఆనంది.




కృష్ణ.. ప్రతీ అమ్మాయికి నచ్చేస్తాడు..

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సందడి చేస్తున్న మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘ఆకాశంలో ఒక తార’. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ సినిమాపై అంచనాలను పెంచగా.. భారీ అంచనాల మధ్య నవంబర్ 20న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ కృష్ణ అనే పాత్రలో కనిపించబోతుండగా.. ‘కృష్ణ.. ప్రతీ అమ్మాయికి నచ్చేస్తాడు.. బాగా కనెక్ట్ అవుతాడు. AOT (ఆకాశంలో ఒక తార) టీజర్ అక్టోబర్ 17న రాబోతున్ని’ అంటూ స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. కాగా.. అంతరిక్షంలోకి వెళ్లాలని పెద్ద కలలు కనే ఒక గ్రామీణ అమ్మాయి కథాంశంతో ఎంతో ఆసక్తికరంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్మగున్నం లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తుండగా.. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నాడు. సాత్విక వీరపల్లి హీరోయిన్. జి.వి ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నాడు.



అమ్మ కదిలి వచ్చేనమ్మా



నవరాత్రి ఉత్సవాలతో ముడిపడిన అమ్మవారి గీతంతో ‘భరతవర్ష’ సినిమా సంగీత ప్రచారం ఊపందుకుంది. ‘అమ్మ కదిలి వచ్చేనమ్మా...’ అంటూ సాగే ఈ పాటలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. గోపీచంద్ కథానాయకుడిగా... సంకల్ప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే ‘భరతవర్ష’. రీతూవర్మ కథానాయిక. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. చివరి దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమాలోని తొలి గీతం ఇప్పటికే విడుదలైంది. ‘అమ్మ కదిలి వచ్చేనమ్మా...’ అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాట బుధవారం విడుదలైంది. అనుదీప్ దేవ్ స్వరకల్పనలోని ఈ గీతాన్ని కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రచించగా, స్కంద వెలువలి ఆలపించారు. ప్రస్తుత సందర్భానికి తగ్గట్టుగానే నవరాత్రి ఉత్సవాలతో ముడిపడిన గీతమిది. భారీ హంగులతో తెరకెక్కించారు. దుర్గాదేవి తొమ్మిది దివ్య రూపాల్ని కూడా ఈ పాటలో చూపించారు. ‘‘ఇదొక చారిత్రక కథతో రూపొందుతున్న చిత్రం. గోపీచంద్ శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు. ఏడో శతాబ్దపు భారతదేశాన్ని ప్రతిబింబిస్తూ సాగే ఈ కథ కోసం... అప్పటి ప్రపంచాన్ని పక్కాగా తీర్చిదిద్ది చిత్రీకరణ చేసింది చిత్రబృందమ’’ని నిర్మాణ వర్గాలు తెలిపాయి.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S